# జీవితం

రచన:
కుమారి ఓగిరాల దుర్గామహాలక్ష్మి

'రేవతీ!

జీవితంలో అనుకోని రీతిగా కొన్ని సంఘటనలు జరిగిపోతుంటాయి, కొన్ని చిరస్మరణీయంగా నిలిచిపోతాయి కదూ! మన జీవితాల్లో అనుకోని సంఘటనలు ఏర్పడుతాయి, అది మన విధివ్రాత అని బలి అవటం తప్పితే మనం చేసేది ఏమీలేదు. నా జీవితం ఇలా పరిణమించి తారుమారవుతుందని కలలోకూడా అనుకోలేదు. మనశ్శాంతి కరువైంది ఇక నా జీవితంలో మిగిలింది! ఆరని కన్నీరు_మాసిపోని వేదన. మనస్సు_మమత, మమకారం, మంచి మనస్సులో పెంచుకుని, ఆశలన్నీ అడియాసలై, విసిగి, వేసారి, బ్రతుకు భారువులో కలలు కరిగి పోగా. మదిలో పెరిగిన గాలిమేడలు కూలిపోగా, జీవితం మీద ఆశతో బ్రతుకుమీద మమత ముడి వేసుకున్న అనుబంధాన్ని కాదనలేక జీవనసాగరంలో తెరచాప చినిగి చుక్కాని కరువైన నావ కష్టసుఖాలకు తలక్రిందలవుతూ. ఎవరినీ కాదనలేక, ప్రయాణం సాగిస్తోంది ప్రాణి! ఏనాటికి, ఏ తీరున ఎప్పుడు ఎక్కడ ఏమవుతుందో? మూడునాళ్ళ ముచ్చటలోనే జీవితమంతా వెగటై పోయింది. ఎవరినీ మెప్పించలేక, నేను సంతోషించలేక, కన్నీరు మున్నీరుగాక వేదనతో కుంటు నడక నడుస్తోంది నా జీవితం_ఆశా నిరాశల మధ్య నలిగిపోయిన నా జీవితం వెగటయి పోయింది.'

ఇట్లు__నీసురేఖ.

ఆ ఉత్తరం చదువుతున్న దగ్గరనుండి రేవతి మనసు మనసులో లేదు. 'ఎందుకు తను అట్లా వ్రాసింది. నవ్వుతూ నవ్విస్తు కబుర్లుచెప్పే తను ఎంతటి విషయమైనా తేలికగా స్వీకరించే తను ఎందుకు అట్లా వ్రాసింది? ఏమయింది? ఏమయినా సరే వెంటనే వెళ్ళి సురేఖనిచూసి రావాలి.' ఆలోచనల నుండి తేరుకున్న రేవతి వెంటనే ప్రిన్స్‌పాల్ గారికి లీవ్ లెటర్ వ్రాసి, గబగబా ఇంటికి వెళ్ళి రెండు జతల బట్టలు సర్దుకుని సురేఖ వాళ్ళ ఊరికి ప్రయాణమైంది.

* * * *

'రేఖా...సురేఖా! లేవా ఇంట్లో? రేవతి పిలుస్తోంది

...........

'రేఖా! సురేఖా!'

...........

'రే......ఖా'! మరింత గట్టిగా పిలిచింది రేవతి తలుపు గొళ్ళెం కొట్టడం చేస్తూ.

'ఎవరు వచ్చింది____హీన స్వరంతో ప్రశ్నిస్తూ, గాలివస్తే పడిపోయేంత సన్నగా ఉన్నావిడ తలుపు తీసింది. ఆవిడ రేవతినిచూసి, నువ్వా! రేవతి: లోపలికిరా' అంటూ ఇంట్లోకి దారితీసింది. పచ్చగా, నిండుగా దర్జాగా ఉండే రేఖానా? ఈ సురేఖ. చూడగానే గుర్తుపట్టటానికి వీలులేనంత మార్పు. అబ్బా! ఎట్లాంటి మనిషి ఎట్లా అయిపోయింది.

లోపలికి వెళ్ళగానే రేవతి భుజంమీద తలపెట్టి ఏడ్వసాగింది. సురేఖ ఏం జరిగింది రేఖా?! ఏమిటి ఇట్లు అయిపోయావు? ఆరే ఏడవకు మరి. నువ్వుఏడుస్తే చూడలేనని నీకు తెలుసుకదూ? నీ బాధ ఏమిటో చెప్పవూ? ఓదారుస్తు కారణం అడుగుతోంది_రేవతి 'నేను ఏడుస్తున్నా, బాధపడుతున్నా చూడలేవని తెలిసే నీకు ఇన్నాళ్లు తెలియచేయలేదు ఇక ఉండలేక పోయాను. నీతో చెప్పుకుంటే కొంత మనశ్శాంతి ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఉత్తరం వ్రాశాను. అబ్బా! ఎట్లా చెప్పను రేవతీ! నాకు చెప్పటానికి నోరు రావటంలేదు'_సురేఖ కారణం చెప్పలేక పోతోంది. ఇంగ్లీషు లెక్చరర్ రేవతి, హిస్టరీ లెక్చరర్ సురేఖను తన భుజంమీదనుండి తీసి మంచంమీద పడుకపెట్టి, ఇప్పుడు చెప్పవద్దు రేఖా! నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకో, నిదానంగా చెప్పుదువుగాని పాపా, బాబు స్కూలునుండి వచ్చే టైమయింది కదూ! వాళ్ళతో నేను ఆడుకుంటాను నువ్వు కాసేపు నిద్రపో. మనసు ప్రశాంతంగా అంటుంది. అంటూ తను మంచంమీద కూర్చుంది. రేవతి ఒడిలో తలపెట్టుకుని సురేఖ కన్నీరు కారుస్తూ, ఇంకా ఎక్కడి పాపా, బాబూ రేవతీ! వారిద్దరు దైవసన్నిధిలో ఉన్నారు. ఈ రంపపు కోత భరించలేకుండా ఉన్నాను. నెల రోజులలో ఒకరి తరువాత ఒకరుగా ఇద్దరూ వెళ్ళిపోయారు నా ఆశల సౌధం కూలిపోయింది, నా జీవన కాంతి తరిగిపోయింది. ఏమి చూసుకుని జీవించాలి?' రేవతి మౌనంగా కన్నీరు కార్చటం మినహా ఏమి చేయలేక పోతోంది. కొంతసేపటికి తన్నుతాను సంబాళించుకుని, చూడు రేఖా! జీవితం పచ్చని పచ్చిక లాంటిది. కష్టసుఖాలు కవల పిల్లలు. నేను నీకు చెప్పదగిన దానిని కాదనుకో! నువ్వే ఇట్లు అయిపోతే చిన్న పిల్ల సుగుణ చూడు ఎట్లు అయిపోయిందో? దాన్ని చూసిఅన్నా నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి. పోయిన వారికోసం విచారించక, ఉన్న దానిని గూర్చి ఆలోచించి, దాని భవిష్యత్తుకు సోపానాలు ఏర్పరుచు,

లేచి కాలి ముఖం కడుక్కోరా మరి త్వరగా' అంటూ సురేఖను బాత్‌రూమ్‌కు పంపి తాను తెచ్చిన బిస్కెట్ల పాకెటు సుగుణకిచ్చి దానితో కబుర్లు చెప్పి నవ్విస్తోంది రేవతి. సురేఖ వచ్చేసరికి సుగుణ కిలకిలా నవ్వుతూ చిన్న చిన్న మాటలతో రేవతితో ఏదో చెపుతోంది సునీత కిలకిలా రావాలు విన్న సురేఖ మాతృ హృదయం గలించిన వారివైపు మళ్ళినా తేరుకుని సుగుణ నవ్వులో అప్పటికి బలవంతంగా పాలుపంచుకుని కాఫీ కలపటానికి లోనికి వెళ్ళింది సురేఖ. మళ్ళీ ఒంటరితనం ఫీలవుతుందేమోనని ఆమెతోపాటు సుగుణను తీసుకుని వంట గదిలోనికి వెళ్ళింది రేవతి. ఆఫీసునుండి సుధాకర్ ఇంటికి వచ్చేసరికి సుగుణ ఏదో పాట పాడుతోంది. సురేఖ, రేవతి నవ్వుతూ కుర్చీల్లో కూర్చుని పాట వింటున్నారు. ఆ దృశ్యం చూసే సరికి అతని మొహములో కూడా నవ్వు తొంగి చూచింది. ముఖ్యంగా సురేఖను గురించే సుధాకర్ బెంగతో ఇన్నాళ్ళు తను ఎంతో చెప్పినా, ఎంత ఓదార్చినా సుగుణను తీసుకువెళ్ళి దగ్గర కూర్చోపెట్టినా ఏది చేసినా సురేఖలో విషాదరేఖలు తొలగిపోలేదు. ఇన్నాళ్ళకు ఆమె స్నేహితురాలు రేవతి ధర్మమా అని సురేఖ, సుగుణ నవ్వ గలుగుతున్నారు. ఇన్నాళ్ళు తల్లి ముభావంగా ఉంటే సుగుణ తల్లి దగ్గరకు వెళ్ళటానికే భయపడింది. తల్లి మొహంలో నేటికి కాస్త విషాదం తగ్గటంమూలంగా తను నవ్వ గలుగుతోంది. మూడేళ్ళయినా మంచి తెలివిగల పిల్ల సుగుణ. ఆ రాత్రి రేవతి వంటచేసి సురేఖ చేత తినిపించింది. భోజనాల దగ్గరకూడా సురేఖ, సుగుణ నవ్వుతూ కన్పించేసరికి సుధీర్‌కు కొండంత బలంవచ్చింది. ఆ రాత్రి సుగుణ పడుకున్న తరువాత, రేవతిని తనదగ్గర కూర్చోపెట్టుకుని విషాద సంఘటనలు ఎలా జరిగింది చెపుతోంది సురేఖ.

ఆ రోజు నేను కాలేజీలో ఏదో మీటింగ్ ఉండి ఓ గంట ఆలస్యంగా ఇంటికి వచ్చేసరికి స్కూలు రిక్షాలో ఇంటికి వచ్చిన పాప, బాబుల గోల విన్పించలేదు. సుగుణ అల్లరి కన్పించలేదు. ఆశ్చర్యపోతూ లోపలికి వెళ్ళేసరికి బాబు, సుగుణ, పాప పక్కన కూర్చుని ఉన్నారు. పాప నిద్రపోతున్నట్లున్నది. నన్ను చూడగానే బాబు లేచి కాళ్లను చుట్టేసుకుని 'అమ్మా! అక్కకి మధ్యాహ్నం జ్వరం వచ్చిందిట క్యారియర్‌లో భోజనం చేయలేదు మా టీచర్ వచ్చి బాబూ అక్కకి జ్వరం వచ్చింది, ఇంటికి వెళ్లిన తరువాత మీ అమ్మతో చెప్పి మందు వేయించు అన్నారు,' అని చెప్తూతూ కళ్లుతుడుచు కున్నాడు. నేను పాప వంటిమీద చెయివేసి చూచాను. ఒళ్లు కాలిపోతోంది. గబగబ కాఫీ కలిపి తాగమని ఇచ్చాను. వద్దు అని నీరసంగా పక్కకి తిరిగి పడుకుంది. నాకు ఖంగారు కలిగింది. ఇంతవరకు పాపకు జ్వరం రావటం ఎరుగను. వెంటనే సుధీరుకు ఫోన్ చేసి పిలిపించి హాస్పటల్‌కు తీసుకువెళ్ళాను. అక్కడ డాక్టర్ నర్సింగ్ హోమ్‌లో ఉంచమని, రేపు ఉదయం వరకు గ్యారంటీ ఇవ్వలేనని చెప్పారు. పాపని హాస్పటిల్‌లో ఎడ్మిట్ చేసి సుధీర్ పిల్లలదగ్గరికి వచ్చారు. నేను అక్కడే ఉన్నాను. ఆ రాత్రి పాప మూసిన కన్ను తెరువలేదు. డాక్టర్ ధైర్యం చెప్తూనే వున్నారు. నర్సు పాపనువదిలి ఎక్కడకీ వెళ్ళకుండా గంట గంటకు నార్మల్ చూస్తూ, పల్సు నోట్ చేసుకుంటూ మందువేస్తూ అక్కడే కూర్చున్నది. ఉదయం అందరి మనసులు కుదుటపడేటట్లుగా పాప లేచి 'అమ్మా కాఫీ కావాల'ని అడిగింది. డాక్టర్ అనుమతితో ఫ్లాస్కులో సుధీర్ తెచ్చిన కాఫీ ఇచ్చాను. తాగిన తరువాత బాబుని, సుగుణను చూడాలని తీసుకరమ్మంది. సుధీర్ వెళ్ళి వారిద్దరిని తీసుకవచ్చిన తరువాత వారితో కబుర్లు చెప్తూతూ చెప్తూతూ దైవసన్నిధికి వెళ్ళిపోయింది. డాక్టర్ వచ్చి 24 గం॥ జ్వరమేమో అని అనుమానం వెలిబుచ్చారు. ఏమాత్రం బాధ పొందకుండా వెంటనే వెళ్ళిపోయింది. సుధీర్ మిత్రులు, నా మిత్రులు వచ్చి ఓదార్చి వెళ్ళారు. ఏదో మాత్రికంగా ఇద్దరం ఉద్యోగాలకి వెళ్లేవాళ్ళం. నీకు తెలియచేస్తావన్నారు సుధీర్ నేనే వద్దని అపాను. అది జరిగిన 15, 20 రోజులలో బాబుకూడా అదే హాస్పటలల్‌లో, అదే బెడ్‌మీద అక్క దగ్గరకు చేరుకున్నాడు. బాబు పోయి 15 రోజులైంది. ఇంక నీకు తెలియచేయకుండా ఉండలేక పోయాను, అందుకే ఉత్తరం వ్రాశాను. 15 రోజులు తిరిగేసరికి సుగుణకు ఏమవుతుందోనని ఆందోళన దానితో సుధీర్ ఎంత బతిమాలిన ఓదార్చినా మామూలు మనిషిని కాలేక పోయాను. నువ్వు వచ్చావు నాకెంతో ధైర్యంగా ఉన్నది. ఇక భయపడాల్సింది ఏమి లేదు. 16 రోజులు గడిచిపోయాయి. సుగుణ క్షేమంగా ఉన్నది. నాకు కావలసినది అదే!'

చెప్పటం ముగించిన సురేఖ, రేవతీ! 'సుగుణను సుధీర్ గదిలో పడుకోబెట్టి వస్తాను. నువ్వు నా దగ్గరే పడుకో!' బతిమాలుతున్నట్లుగా కోరింది. రేవతి కాదనలేకపోయింది.

మరునాడు చిరునవ్వుతో తనకు కాఫీ అందివ్వటానికి వచ్చిన సురేఖతో, 4 రోజులు సెలవుపెట్టి మీరిద్దరూ నాతో బాటు రండి స్థలం మార్పు బాగుంటుంది కొంత బాధతగ్గుతుంది, రిలాక్సింగ్‌గా ఉంటుంది, బావగారితో చెప్పి బయలుదేరు అన్నది రేవతి, ప్రక్క గదిలో నుండి

సంభాషణ విన్న సుధీర్ 'నా కభ్యంతరమేమి లేదమ్మా. సురేఖ ఎట్లా మళ్లీ మామూలు మనిషి కాగలుగుతుందా అనే నా తపన అంతా' అని రేవతితో అంటూ 'రేఖా, లీవ్ లెటర్ వ్రాసివ్వు నేను ఆఫీసుకు వెడుతూ కాలేజీలో ఇచ్చేసి వెడతాను, నువ్వు ప్రయాణానికి సిద్ధంగా ఉండు' అంటూ స్నానం చేయడానికి వెళ్ళాడు.

* * * *

అయిదు రోజుల తరువాత నవ్వుతు నవ్విస్తూ చలాకీగా తిరిగే సురేఖ చూచి రేవతితో 'నిజంగా నీకు నేను కృతజ్ఞుణ్ణి. నా సురేఖను తిరిగి నా కప్పగించావు' అన్నాడు సుధీర్. దానికి రేవతి 'అదేమి బావగారు సురేఖ అట్లా వుంటే నేను మటుకు చూస్తూ ఎట్లు ఊరుకోగలను' ఆమె మీకు భార్య నాకు చిన్ననాటి స్నేహితురాలే కాదు ఆత్మబంధువు. ఆమె ఇదివరలో నా జీవితానికి జీవం పోసి, మనిషిగా నిలబెట్టగలిగిన ప్రాణ మిత్రురాలు. అందులో నేను చేసినది ఏమి లేదు. చీకటి తెర తొలగించటానికి ప్రయత్నించాను. నిమిత్త మాత్రురాలిని, దీనికి కారణం నేను బాధపడుతుంటే ఆమె చూడలేదు. అఫ్ కోర్సు, నేనూ అంతే అనుకోండి. కనుక మీరు నన్ను పొగడాల్సిన అవసరమేమీ లేదు, కాని చిన్న మనవి ఆమెను ఒంటరిగా కొన్నాళ్ళపాట ఉంచకండి. ఇంత కన్న చెప్పే దేమి లేదు.' అంటూ రేవతి. తృప్తిగా నవ్వుతున్న సుధీర్, సుశ్రీల వంక చూస్తూ సుగుణను ఎత్తుకు ముద్దాడుతోంది.


# ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ !!

## ఎంట్రీ ఫీజులేదు - మీరు బహుమతిని గెలుపొందవలెను

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి; ఒక స్కూటరు వెస్పా లేక ఆల్విన్ రిఫ్రిజిరేటర్ లేక టెలివిజన్ సెట్. 2 వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమేటిక్ కెమేరా 3వ బహుమతి: (100) టోషిబా జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్లు. ధర: రు. 275/- ధరలో అర్ధ, ప్రతి కుటుంబానికి చక్కని బహుమతి.

## మీరు చేయవలసినది?

(12 పన్నెండు)నుంచి 27 (ఇరవై ఏడు) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడినా మొత్తం 78(డెబ్బైఎనిమిది)వచ్చునట్లు ఒకఅంకెనుఒకేసారి వాడి పైగదులను పూరించవలెను. ఎంట్రీలకు తెల్లకాగితమును ఉపయోగించవలెను.

ఆఖరి పోస్టింగ్ తేదీ: 29-9-73

ఫలితం తేదీ: 30-9-73

సహాయమునకొరకు 46 మొత్తము:

| | | | |
|---|---|---|---|
| 15 | 18 | 21 | 20 |
| 22 | 19 | 16 | 17 |
| 24 | 25 | 14 | 11 |
| 13 | 12 | 23 | 26 |

(1) ప్రమోటర్ల నిర్ణయం న్యాయమైనది. మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయంలో ఇది ఒక ముఖ్యమైన షరతు. (2) ఎంట్రీలయొక్క సక్రమము మా ఆఫీషియల్ సీల్డు సొల్యూషన్ తో సరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. (3) నగదుగా బహుమతి ఇవ్వబడదు. (4) మొదటి బహుమతి (1) ఆఫీషియల్ సొల్యూషన్ తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడినదానికి యివ్వబడును. (5) రెండవ బహుమతి: (1) పైన అడ్డముగావున్న 3 వరుసలలో సమానంగా వున్నదానికి ఇవ్వబడును. (6) మూడవ బహుమతి: (100) మా ఆఫీషియల్ సొల్యూషన్ తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా సమానముగా వున్నదానికి యివ్వబడును. (7) గెలుపొందిన వారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలెను. (8) ఫలితములు పొందుటకు 40 పైసల పోస్టల్ స్టాంపులు పంపాలి. (9) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము ఉంచుకోండి.

JAPAN BLUE STAR (M·K·M-78)

P.O. Box No. 1878, DELHI-6.